# గిల్టీ

వీరభద్రరావ్ పమ్మి

**అంతా** సవ్యంగానే జరిగింది.

ఆ ఒక్క సంఘటన జరగకుండా ఉంటే నేనెంతో ఆనందపడేవాణ్ణి. కానీ జరిగిపోయింది. ఎంత వద్దంటున్నా మేరీ అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ అడుగుతోంది. అలా అడిగినప్పుడల్లా నేను 'గిల్టీ'గా ఫీలవుతున్నాను. నన్ను బాధ పెట్టాలని కాదు గాని ... విషయమేమిటో తెలుసుకోవాలని మేరీ అడుగుతోందని నాకు తెలుసు.

అస లదంతా ఎలా జరిగిందంటే...!

• • • •

ఇంగ్లండులో ఉంటున్న మా బావ, అక్క నాకు ఉత్తరం రాశారు. వాళ్ళకి తెలుసున్న మేరీ అనే ఇంగ్లీషు అమ్మాయి కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఆర్కియాలజీలో రిసెర్చి చేస్తోందని, ఇండియాలోని గుళ్ళు, గోపురాలు, పాత కట్టడాలు చూడ్డానికి వస్తోందని, హైదరాబాద్‌లో ఓ వారం రోజులు ఉంటుందని, ఆమె ఉండే వారం రోజులు ఆమెక్కావల్సిన సహాయ సహకారా లందించమని రాశారు.

తర్వాత రెండు రోజులకి తనని తానూ పరిచయం చేసుకుంటూ మేరీ నుంచి ఉత్తరం వచ్చింది.

మేరీ హైదరాబాద్‌లో ఉండే వారం రోజులు ఆఫీసుకి సెలవు పెట్టి ఆమె క్కావలసిన సహాయ సహకారా లందించగలనని మేరీకి, అక్కకి విడిగా ఉత్తరాలు రాసి పోస్టు చేశాను. అప్పట్నుంచి పది హేను రోజుల కోసారి మేరీ ఉత్తరం రాస్తూనే ఉంది. నేను జవాబులు రాస్తూనే ఉన్నాను. మేం ఒకళ్ళ నొకళ్ళం కలవకుండానే మంచి స్నేహితులమై పోయాం. ఇండియా చూడాలన్న ఉత్సాహం ఆమె రాసే ప్రతి ఉత్తరంలోనూ కనబడుతుంది.

ఆమె తన ప్రోగ్రామ్ ప్రకారం బొంబాయిలో దిగుతుంది. అక్కణ్నుంచి ఢిల్లీ వెళ్ళి అక్కడ చుట్టు పక్కల ఉన్న కట్టడాలు, సమాధులు, మసీదులు చూసుకుని హైదరాబాద్ వస్తుంది. హైదరాబాద్‌లోను, చుట్టుపక్కల పని ముగించుకుని బెంగుళూరు వెడుతుంది. బొంబాయిలో దిగగానే ఒకటి, ఢిల్లీ నుండి రెండు ఉత్తరాలు రాసింది నాకు. చివరి ఉత్తరంలో తను ఏ రోజున హైదరాబాద్ వస్తున్నదీ తెలియజేసింది.

నేను, నా భార్య స్టేషన్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకున్నాం. ఆమె మమ్మల్ని కలిసినందుకు ఎంతో ఆనందపడింది. స్టేషన్నుంచి బైటికి రాగానే అడిగింది:

"నా కేదైనా హోటల్ రూమ్ బుక్ చేశావా?"

"లేదు."

ఆమె ఆత్రంగా నా కేసి చూసింది.

"అదేం? హోటల్ బుక్ చెయ్యమని నీకు రాశానుగా?"

"రాశావ్ ... కాని నువ్ మా ఇంట్లోనే, మాతోనే ఉందువు గాని ..."

"మీ ఇంట్లోనా?—నో ... మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నా కిష్టం లేదు."

"మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. పైగా అతిథులు వస్తే ఇంట్లో పెట్టుకుని సత్కారాలు చెయ్యడం మా ఆచారం."

"అలా కాదు."

"అద్దెదైనా మే ముంటున్నది పెద్ద ఇల్లే. మా కెలాంటి ఇబ్బందీ కలగదు. నీ కంతగా ఇబ్బంది అయితే సాయంత్రం హోటల్‌కి మారిపోదువుగాని."

"అబ్బే—నా కిబ్బందేమిటి? పోదాం, మీ ఇంటికి" అంది మేరీ.

మా ఇల్లు, మేరీకోసం మేం చేసిన ఏర్పాట్లు ఆమెకి నచ్చాయి. ముఖ్యంగా ఆమెను దోమలు బాధించకుండా ఎక్కువ జాగ్రత్తలు తీసుకున్నాం.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాల దగ్గర "ఇండియా నీకు నచ్చిందా — నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగాను మేరీని.

"మా దేశంలో చాలా మందికి ఈ దేశం మీద మంచి అభిప్రాయం లేదు. ఇక్కడ దరిద్రం, రోగాలు, అశుభ్రత, మోసం, దగా మాత్రమే ఉన్నట్టు నాకు చాలామంది చెప్పారు. ఇక్కడంతా కుళ్ళిన నిలవనీళ్ళు తాగుతారని, నేనూ అవే తాగాల్సి వస్తుందని, దాని వల్ల రోగాలు వస్తాయని నన్నంతా భయపెట్టారు. కొందరైతే "ఇండియా వెడుతున్నావా? సరే, తిరిగి వచ్చినట్టే" అన్నారు. మీకు స్వాతంత్ర్యం రాక ముందు మా తాత ఈ దేశంలో మిలిటరీలో పని చేశాడట. నా చిన్నతనంలో మా నాయనమ్మ ఈ దేశం గురించి ఎన్నో ముచ్చట్లు చెప్పింది—ముఖ్యంగా వివిధ భాషలు, వివిధ సంస్కృతులు, వివిధ వేష ధారణలు, వివిధ అలవాట్లు, ఆచారాలు... ఇన్ని రకాల ప్రజలు ఒక దేశంగా, ఒక జాతిగా ఒక ప్రభుత్వం కింద ఎలా బతుకుతున్నారా అనిపిస్తుంది నాకు. అందుకే ఈ దేశం రావాలని నిర్ణయించుకున్నాను. ఎంతమంది నిరుత్సాహ పరిచినా నా రిసెర్చికి ఇండియానే ఎన్నుకున్నాను."

"ఇంతకీ ఈ దేశం మీద నీ అభిప్రాయం చెప్పలేదు" అనడిగాను.

"మంచి అభిప్రాయమే కలిగింది. ఇక్కడ దరిద్రం మాత్రమే ఉందనుకోవడం పొరపాటు. ఢిల్లీలోను, బొంబాయిలోను ఉన్న హోటల్స్ చూస్తే— ఇంగ్లండ్‌లో చాలా హోటల్స్‌కన్నా బావుంటాయి. భవనాలు, ఆఫీసులు చూస్తే మీ రెంత అభివృద్ధి సాధించారో తెలుస్తుంది. ముఖ్యంగా మీకు మంచి చరిత్ర ఉంది. వెనకాల బోలెడంత సంస్కృతి ఉంది. కాని ... ప్రజాస్వామ్య దేశంగా సాధించవల్సినంత ప్రగతి సాధించలేదని విమర్శించే వాళ్ళతో నేనూ ఏకీభవిస్తాను. మీ దేశమనే కాదు — ప్రపంచంలోని ఏ దేశాన్ని తీసుకున్నా మానవుడు సుఖంగా లేడు. సమస్యలు రకరకాలు ... ఎన్నో శతాబ్దాలుగా ప్రజాస్వామ్య దేశంగా ఉన్న మా దేశానికూడా ఎన్నో సమస్యలు ... మితిమీరిన నిరుద్యోగం, ఆకలి, వేదన. మా దేశంలోను, అమెరికాలోను కూడా యువత పెద్ద సమస్యగా తయారయింది. వాళ్ళకి సరైన దార్శనికత లేదు. అటువంటి విషయాల్లో మీ దేశం ఎంతో మెరుగనిపిస్తుంది."

మేరీ ఇండియాలో తను చూసిన రెండో వైపు గురించి చెప్పకుండా దాటేసిందని స్పష్టంగా తెలుస్తోంది. ఆ విషయం గురించి నేను మళ్ళీ మళ్ళీ రెట్టించి అడగలేదు.

ఒక పక్క సంపద పెరుగుతుంటే, మరోపక్క ఆకలి, అవసరం పెరిగిపోతున్నాయని నాకు తెలుసు. ప్రభుత్వ పథకాలు కాగితాల మీద మాత్రమే కనిపిస్తున్నాయని...సహాయం చేరాల్సిన చోటుకి చేరడం లేదని...మధ్యలో ఎన్నో రాబందులు, మొసళ్ళు, గద్దలు తన్నుకు పోతున్నాయన్నది నిజం ... మరో దేశస్థురాలి ముందు తలెత్తుకు తిరగాల్సిన పరిస్థితి కాదు మనది.

మా తాతలు నేతులు తాగారని చెప్పుకోవడం తప్పితే నాకు గంజినీళ్ళు లేవన్న సత్యాన్ని చెప్పుకోడానికి ఏదో బిడియం, సిగ్గు, గిల్టీ ...

మేరీ తను బెంగుళూరు వెళ్ళాల్సిన రోజు నిర్ణయించుకుంది. ముందుగా తీసుకుంటే తప్ప రైల్లో రిజర్వేషన్ దొరకదు. ఆ రోజు స్టేషన్‌కి వెళ్ళి టికెట్ రిజర్వు చేయించుకుని ఓ సారి సిటీ అంతా తిరిగి రావాలని నేను, మేరీ నిర్ణయించుకున్నాం.

సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్ళి టికెట్ రిజర్వు



చేయించాం. సరిగ్గా అప్పుడే రెండు, మూడు రైళ్ళు రావడంతో స్టేషనంతా రద్దీగా ఉంది. స్టేషన్ ముందు మరీ హడావుడిగా, రద్దీగా ఉంది. ఆటోల వాళ్ళు, టాక్సీల వాళ్ళు, రిక్షాలవాళ్ళు, కూలీలు, ప్రయాణికులు, సామాన్లు, కేకలు, రోతలు... చిన్న సైజు నరకంలా ఉంది.

వీటన్నింటికీ మించి ప్రయాణికుల్ని అడ్డగించి, చేతులు ముందుకు చాపి, కాళ్ళ మీద చేతులుంచి, చొక్కాలు లాగి, మొహం మీద చేతులుంచి అడుక్కుంటున్న ముష్టివాళ్ళు ... వాళ్ళని అదిలిస్తూ, బెదిరిస్తూ, కేకలు పెడుతూ తప్పించుకుపోయే ప్రయాణికులు ...

మేరీ వో పక్కగా నుంచుని అంతా చూస్తోంది. నేను ఆమెకు కొంచెం దూరంగా నిలబడి ఆమెనే చూస్తున్నాను. ఆమె మొహంలో భావాలు చదవడానికి ప్రయత్నిస్తున్నాను. ఆమె తదేకంగా వో ముష్టివాడివైపు చూస్తోంది.

అతను బాగా ముసలాడు. వంగి నడుస్తున్నాడు. కళ్ళు కనబడవు. కర్ర సాయంతో నుంచున్నాడు. ఒక చెయ్యి చాపి డబ్బులు అడుక్కుంటున్నాడు. ముడతలు పడిపోయిన మొహం, గాజు గోళాల్లాంటి కళ్ళు, తైల సంస్కారం లేని జుట్టు, ముక్కలు ముక్కలుగా విరిగిపోయినట్టు, బీడుపడిన నేలలాంటి శరీరం ... ఎండిపోయి లోపలికి అతుక్కుపోయిన కడుపు ... దరిద్రానికి, ఆకలికి ప్రతినిధిలా ఉన్నాడు. మూడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యానికి ప్రతీకలా ఉన్నాడు.

మేరీ అక్కడి వాతావరణాన్ని, అక్కడి ముష్టాణ్ణి ఆలా చూస్తూంటే నాకు బాధగా, గిల్టీగా ఉంది. తర్వాత నన్నేమైనా ప్రశ్న అడుగుతుందేమోనని భయంగా ఉంది. అంతలో ...

ఒక ప్రయాణికుడు రెండు భుజాలకి రెండు బేగ్‌లు తగిలించుకుని, రెండు చేతుల్లో రెండు సూట్‌కేస్‌లు పట్టుకుని హడావుడిగా. గబగబా నడుస్తూ, గుడ్డి ముషాణ్ణి రాసుకుంటూ వెళ్ళిపోయాడు. అతని భుజాన్న వేళ్ళాడుతున్న బేగ్ తగిలిందో, చేతిలోని సూట్‌కేసు తగిలిందో తెలియదు కాని,ముష్టాడి చేతిలోని కర్ర నేలమీద పడిపోయింది.

ముష్టాడు గావు కేక పెట్టాడు. ప్రయాణికుడు కనీసం వెనక్కైనా తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.


ఇదంతా కళ్ళార్పకుండా చూస్తున్న మేరీ ఒక్క ఉదుటున వెళ్ళి కర్ర తీసి ముష్టాడి చేతి కందించింది. కర్ర అందుకున్న ముష్టాడు రెచ్చిపోయాడు. కర్ర గాల్లోకి తిప్పుతూ గట్టిగా తెలుగులోనూ, ఉర్దూలోనూ తిడుతూ, అరుస్తూ కేకలు పెడుతున్నాడు. వాడలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో, ఏమంటున్నాడో అర్థంకాని మేరీ శిలా ప్రతిమలా నిలబడిపోయింది. జనమంతా వింత చూస్తున్నారు. మేరీ తెల్లబోయి నా మొహంలోకి చూస్తోంది. నేను మేరీ జబ్బ పట్టుకుని 'పదా, పోదాం!' అని గబాగబా ఇవతలికి తీసుకొచ్చేశాను.

మేరీ హైదరాబాద్‌లో ఉన్న వారం రోజులు చక్కని ఆతిథ్యం ఇచ్చాం. ఆర్కియాలజీ డిపార్టు

**1983 ఫిబ్రవరి సైనిక స్కూలు, కోరుకొండ ప్రవేశ పరీక్షలలో మనల సాధించిన అద్భుత విజయాలు !**

రాష్ట్రంలో

మొదటి ర్యాంకు     మూడవ ర్యాంకు



సి హెచ్. రామారావు     ఎస్. శ్రీనివాసరావు

సాధించిన పై విద్యార్థులేకాక ఇంకనూ ఈ సంవత్సరము చేరిన ఎందరో విద్యార్థులే ఇందుకు నిదర్శనము

స్థాపితము : 1962     ఫోన్ : 22084



**శ్రీ విద్యా విహార్**

(ఆదర్శ గురుకుల విద్యాసంస్థ)

లలితానంద నగర్, రింగు రోడ్డు,

గుంటూరు-522 006

బ్రాంచి : దాసరివారి వీధి, (కనకదుర్గా టాకీసు ఎదుటి వీధి) విజయవాడ-2

**1984 ఫిబ్రవరి కోరుకొండ సైనిక స్కూలు ప్రవేశ పరీక్షలకు క్లాసులు నవంబరునుండి ప్రారంభము**

ఇంకనూ ఇతర స్కాలర్‌షిప్ పరీక్షల వివరములకు వెంటనే వ్రాయండి

ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలలో బోధన.

**నర్సరీనుండి 10 వ తరగతి వరకు క్లాసులు గలవు**

స్థానికులకు బస్సు సౌకర్యము గలదు

ప్రిన్సిపాల్     డైరెక్టర్

యం. వి. పూర్ణచంద్రరావు     యం.వి.రామకృష్ణారావు

మెంటుకి తీసుకెళ్ళి అక్కడి ఆఫీసర్లను పరిచయం చేశాను. వాళ్ళు ఆమె రిపోర్టు క్కావల్సిన వివరాలెన్నో ఇచ్చి సాయపడ్డారు. హైదరాబాద్‌లోనేకాక, ఆలంపూర్, తిరుపతి, అన్నవరం, సింహాచలం మొదలైన చోట్ల ఉన్న కట్టడాలు, గుళ్ళు, గోపురాలు మేరీకి దగ్గరుండి చూపించాను ... నేను ఎంతో సహాయపడ్డానని ఆమె నన్ను మరీ మరీ మెచ్చుకుంది.

కానీ ... సికిందరాబాద్ స్టేషన్ దగ్గర ముష్టాడికి పడిపోయిన కర్ర తీసి ఇస్తే, గాల్లోకి కర్ర వూపుతూ కేకలేడుతూ అన్న మాటలేమిటో చెప్పమని, అవి తిట్లు, శాపనార్థాలు ఏవైనా తనేమీ అనుకోనని వారం రోజుల్లోనూ మేరీ చాలాసార్లు అడిగింది. బతిమాలింది ... నా మీద అలిగింది ...

అయినా నేను చెప్పలేదు.

ఆమె బెంగుళూరు వెళ్ళాల్సిన రోజు రానే వచ్చింది. ట్రెయిన్ ఎక్కబోయే ముందు "మీ రిచ్చిన ఆతిథ్యానికి, చేసిన సహాయానికి, నా కిచ్చిన బహుమతులకి ఎంతో ... ఎంతో కృతజ్ఞురాల్ని ... నా మనసుని మీ దగ్గర వదిలేసి, తీపి జ్ఞాపకాల్ని నాతో తీసుకువెడుతున్నాను. కాని బరువెక్కిన గుండెతో వెడుతున్నాను. ఇన్ని చేసినా ఆ నేళ ఇదే స్టేషన్ ముందు ఆ ముష్టాడు అన్న మాటలు ఏమిటో నాకు చెప్పలేదు. అది చెప్పేస్తే నా గుండె బరువు తగ్గుతుంది. నాకోసం ఇంత చేశావ్ ... ప్లీజ్ ... అదేమిటో చెప్పవూ?" అంది మేరీ.

ఆమె కళ్ళలో నీళ్ళు ...

ఆమె ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకుంటుందని నే ననుకోలేదు.

"ఏం లేదు ... 'నా కర్ర ఎవరో కొట్టెయ్యాలని చూస్తున్నారు. నా కున్న ఒక్క ఆధారం దొంగిలించాలని ప్రయత్నిస్తున్నారు. ప్రపంచమంతా దొంగవెధవల మయం ...' అన్నాడు ముష్టాడు. నువ్వు కర్ర తీసి వాడి కిస్తే వాడలా అనుకున్నాడు."

చెప్పడం పూర్తిచేసి తల దించుకున్నా న్నేను. మేరీ నా దగ్గరగా వచ్చి గెడ్డం మీద చెయ్యి ఆన్చి నా తల పైకెత్తింది. నా కళ్ళలోకి చూసింది.

నా కళ్ళలో తడి ...

ప్రపంచంలో అందరికీ అర్థమయే భాష.

"మా నాయకులు మీ దేశాన్ని మూడొందల సంవత్సరాలు కొల్లగొడితే, ముప్పై ఆరుదేళ్ళనుంచి మీ నాయకులు మిమ్మల్ని కొల్లగొడుతున్నారు. ప్రపంచంలో ఏ మనిషికి ఆకలైనా, బాధైనా, కన్నీళ్ళయినా ఒకటే... నీతోపాటు నేనూ తప్పు చేసినట్టుగా బాధపడుతున్నాను. మానవుడి కీ పరిస్థితుల్లో ఉన్నందుకు సిగ్గుపడుతున్నాను ...

ఆ ముష్టతను తిట్టడానికి నేను బాధపడటం లేదు. నువ్వు గిల్టీగా ఫీలవ్వాల్సిందేమీ లేదు...

తోటి మనుషులు ఇంత దుర్భరంగా బ్రతుకుతున్నందుకు నువ్వు, నేను, అందరం బాధపడాలి."

రైలు కూతవేసింది.

మేరీ కళ్ళు తుడుచుకుంటూ రైలెక్కింది.

పరాయి దేశస్థురాలైన ఆమె పడుతున్న వేదనలో పదో వంతు మనం, మన నాయకులు పడితే మన పరిస్థితులు ఇంత దారుణంగా ఉండేవి కాదేమో అనిపించింది.

*

( చాలా సంవత్సరాల క్రితం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఓ ఆస్ట్రేలియన్ వనిత రాసిన ఉత్తరం ఆధారంగా ... )